ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జనగామ

బుధవారం 3 ఏప్రిల్ 2024



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : బుధవారం సా : 6.34 గం.

సహర్ : గురువారం ఉ : 4.46 గం.

తుక్కుగూడ సభకు తరలాలి..

- ఉమ్మడి జిల్లా నుంచి తరలింపు ఏర్పాట్లు చేస్తున్నాం..
- కాంగ్రెస్ మేనిఫెస్టోను రాహుల్‌గాంధీ విడుదల చేస్తారు..
- లోక్‌సభ ఎన్నికల్లో కడియం కావ్యను గెలిపించాలి..
- మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

7లో..

నా నిజాయితే రాజకీయ ఉన్నతికి మూలం

- బీఆర్ఎస్ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు..
- యశస్వినిరెడ్డి చేతిలో ఓడినా ఎర్రబెల్లికి సిగ్గు రాలేదు
- నాపై చేసిన ఆరోపణలను పల్లా నిరూపించాలి..
- కేసీఆర్ అంటే గౌరవం ఉంది..
- దండోరా ముసుగు తీసి మందకృష్ణ బీజేపీలో చేరాలి
- నా బిడ్డ కావ్యను ఆశీర్వదించి గెలిపించండి
- మీడియా సమావేశంలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం



సమావేశంలో తన కూతురు కావ్యతో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

7లో..

బాప్ రే..!

- ఉదయం నుంచే ఎండ తీవ్రత షురూ
- వేడిగాలులు, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి
- 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు



నిర్మానుష్యంగా నెల్లుట్ల ఫ్లైఓవర్

జిల్లాలో ఠారెత్తిస్తున్న ఎండలు

జనగామ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. వేసవి తీవ్రతతో జిల్లా అంతటా నిప్పుల కొలిమిలా మారింది. వేసవి ఆరంభంలోనే భానుడు ఉగ్రరూపం దాల్చడంతో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రోజురోజుకీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జిల్లాలో వారం రోజులుగా రికార్డు స్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఉదయం 7 గంటల నుంచే సూర్యుడు సుర్రుమనిపిస్తున్నాడు. దీంతో జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. మండుతున్న ఎండలతో ప్రజలకు పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. ఎండలకు తోడు వేడిగాలులు, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పగలు ఎండ, రాత్రి పూట ఉక్కపోతతో జనం సతమతమవుతున్నారు. ఎండల వల్ల జనం వడదెబ్బకు గురవుతున్నారు. వేసవి తీవ్రత పెరగడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఎండలు మరింత ముదిరే అవకాశం ఉండడంతో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర మందులను అందుబాటులో ఉంచారు.

జిల్లాలో 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత

- జిల్లాలో వారం రోజులుగా ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. సాధారణ స్థితిని దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జిల్లాలో సోమ, మంగళవారాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో మంగళవారం చిల్పూరు మండలం మల్కాపూర్‌లో అత్యధికంగా 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏప్రిల్ మొదటి వారంలోనే ఎండలు ఈ స్థాయిలో ఉంటే మే నెలలో ఏ విధంగా ఉంటాయోనని ప్రజలు భయపడుతున్నారు.

జిల్లాలో వారం రోజులుగా ఉష్ణోగ్రతలు

నెల	తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
మార్చి	26	38.4	33.1
మార్చి	27	40.1	32.3
మార్చి	28	40.4	26.1
మార్చి	29	39.6	27.6
మార్చి	30	40.3	26.1
మార్చి	31	39.1	28.3
ఏప్రిల్	1	40.3	28.5
ఏప్రిల్	2	41.6	27.8

బయటకు రావాలంటేనే భయం

ఎండల తీవ్రతల వల్ల ప్రజలు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఏదైనా అత్యవసర పనులు ఉంటేనే తప్ప జనం ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. ఉదయం 7 గంటల నుంచే సూర్యుడు వస్తుండగా 11 గంటలకే చుక్కలు చూపించేతంగా ఎండ తీవ్రమవుతోంది. మధ్యాహం పూట ప్రజలు బయటకు రావడమే లేదు. ఎండ తీవ్రతకు భయపడి మధ్యాహ్నం వేళల్లో పనుల్ని వాయిదా వేసుకుంటున్నా రు. సాయంత్రం 6 గంటలకు కూడా ఎండ ఉంటుం డడంతో వాతావరణం చల్లబడిన తర్వాతే జనం బయ టకు వస్తున్నారు. దీంతో ఇతర సీజన్లలో నిత్యం రద్దీగా కన్పించే రోడ్లు, వీధులన్నీ మధ్యాహ్నం పూట జనసంచా రం లేక బోసిగా కన్పిస్తున్నాయి.



ఎండవేడిని తట్టుకునేలా తలపై కర్చీఫ్, టోపీతో బైక్‌పై వెళ్తున్న దృశ్యం

వేసవి తాపం నుంచి రక్షణకు..

ఎండల నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు కూలర్లు, ఏసీలను వాడుతున్నారు. ఎండలు దంచి కొడుతుండడంతో వాటి నుంచి ఉపశమనం పొందేందుకు జనం వివిధ మార్గాలను ఎంచు కుంటున్నారు. శీతల పానీయాలు, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకుంటున్నారు. ఎండ తీవ్రతతో కూలర్లు, ఏసీల అమ్మకాలు పెద్ద మొత్తంలో పెరిగాయి. నిన్న మొన్నటి వరకు సంపన్నులు మాత్రమే ఏసీలు కొనుగోలు చేయగా నేడు ఎగువ మధ్యతరగతి పేదలు సైతం పెద్ద సంఖ్యలో ఏసీలను వినియోగిస్తున్నారు. అంత స్థోమత లేనివారు కూలర్ల కిందే గడుపుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

ఎండలు దంచి కొడుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఎండలో పనిచేసే రైతులు, భవన

మిగతా 8వ పేజీలో...



'వేసవిలో జాగ్రత్తలు' వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్



ఇద్దరు నకిలీ మావోయిస్టుల అరెస్టు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 2: హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులతోపాటు డెయిరీ నిర్వాహకుడిని మావోయిస్టుల పేరుతో బెదిరింపులకు పాల్పడిన ఇద్దరు నకిలీ మావోయిస్టులను హనుమకొండ, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. మంగళవారం హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి నిందితుల వివరాలను వెల్లడించారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన దాసరి శ్రీకాంత్ సులువుగా డబ్బులు సంపాదించడం కోసం మావోయిస్టుల పేరును వాడుకొని వసూళ్లకు పాల్పడాలని ప్రణాళిక రూపొందించారు. ఇందుకు కరీమాబాద్‌కు చెందిన బాలిని మహేశ్ సహాయం తీసుకున్నాడు. వీరు భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు చర్ల శబరి ఏరియా కమిటీ పేరుతో లెటర్‌ప్యాడ్ ముద్రించారు. కాగా, ఈనెల 29న మావోయిస్టు కమాండర్ దేవన్న పేరుతో గూడెప్పాడ్‌లోని ఎస్ఎస్ఆర్ డెయిరీ, హనుమకొండలోని అజర, దీపక్ శోధన్ ఆస్పత్రి రిసెప్షన్‌లలో లెటర్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. అలాగే అదే రోజు రాత్రి నుంచి వీరికి ఫోన్‌లు చేసి ఆస్తులు వివరాలు, డబ్బులు పట్టుకొని రాకపోతే చంపుతామని బెదిరించారు. దీంతో బాధితులు హనుమకొండతోపాటు ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసుల నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు ప్రారంభించారు.

ఈ క్రమంలో మంగళవారం ఉదయం ములుగురోడ్డులోని హనుమాన్ జంక్షన్‌లో వాహనాలు తనిఖీలు చేస్తుండగా దాసరి శ్రీకాంత్ పట్టుబడ్డారు. విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. బాలిని మహేశ్ సహాయంతో లెటర్ ప్యాడ్లు ముద్రించామన్నారు. వెంటనే మహేశ్‌ను కరీమాబాద్‌లో ఆదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 70 లెటర్ ప్యాడ్లు స్వాధీనం చేసుకొని, సెల్‌ఫోన్‌లను, బైక్‌లను పోలీసులు సీజ్ చేశారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



హైదరాబాద్‌లో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నాయకురాలు ఝాన్సీరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన పాలకుర్తి బీఆర్ఎస్ నాయకులు

పాలకుర్తి, ఏప్రిల్ 2 : మండలంలోని పలు గ్రామాల నుంచి బీఆర్ఎస్ మాజీ సర్పంచులు, మండల, గ్రామ స్థాయి నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి నాయకత్వంలో హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి సుమారు 200 మంది కాంగ్రెస్‌లో చేరారని అన్నారు. పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని భావించి ఇతర పార్టీల నేతలు చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరినవారిలో కమ్మగాని ఆంజనేయులు, మారం శ్రీనివాస్, అంగడి సోమనర్సయ్య, గంగు పట్టాభి రామ్మూర్తి, చిదిరాల మార్కెండయ్య, నెమురుగొమ్ముల శ్రీనివాసరావు, శివరాత్రి సోమయ్య, లావుడ్యా మల్లానాయక్, కూనూరు కృష్ణమూర్తి, వీరయ్య, సత్యనారాయణ, మురళీ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు రాపాక సత్యనారాయణ, కాకిరాల హరిప్రసాద్, జల్లం కుమార్, మొగుళ్ల కుమార్ పాల్గొన్నారు.

పాపన్న ఆశయ సాధనకు కృషి

గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటనారాయణ గౌడ్



పెంబర్తిలో పాపన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న గౌడ సంఘం నేతలు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 2 : తొలి తెలుగు బహుజన వీరుడు సర్వాయి పాపన్న ఆశయాల సాధనకు కృషి చేయాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల వెంకటనారాయణ గౌడ్ పిలుపునిచ్చారు. బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 314 వర్ధంతి సందర్భంగా మంగళవారం జనగామ మండలం పెంబర్తిలో పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వాయి పాపన్న చరిత్రను బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తించి.. ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించిందన్నారు. శిథిలావస్థలో ఉన్న ఖిలాషాపూర్ కోటను పునఃనిర్మించి, పాఠ్యాంశాల్లో పాపన్న చరిత్రను, ఆయన గొప్పతనాన్ని ప్రశ్నావళి రూపంలో తీసుకువచ్చిందని గుర్తు చేశారు. బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో గౌడ ఐక్య సాధన సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు అంబాల ఆంజనేయగౌడ్, మార్కెట్ మాజీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, గోదల వంశీధర్‌రెడ్డి, నక్క కృష్ణ, రాజు, బైరు మహేందర్, సీర్గాల రత్నం, యాదగిరి, బాలరాజు, సంపత్, దుర్గేశ్, దుర్గాచలం, సోమనర్సింహాచారి, శంకర్, శ్రీనివాస్, రాజు, భాను, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలి

కలెక్టర్‌కు బీఆర్ఎస్ నాయకుల వినతి

జనగామ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండిపోయిన పంటలకు ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని జడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మీ, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున డిమాండ్ చేశారు. ఈ మేరకు జనగామ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తక్షణమే కాలువల ద్వారా చెరువులు నింపి పంటలకు నీరందించాలన్నారు. ఇప్పటికే జిల్లాలో చాలా వరకు పంటలు ఎండిపోయాయని, ఇంకా ఒకటి, రెండు తడులు అందిస్తే కొంత నష్ట తీవ్రతను తగ్గించే అవకాశం ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వ్యవసాయానికి నాణ్యమైన త్రీఫేజ్ కరెంట్ ఇవ్వాలన్నారు. పంటల సర్వే చేయించి ఎండిన పంటలకు నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. సాగునీటి కొరత కారణంగా యాసంగిలో దిగుబడులు తగ్గే అవకాశం ఉన్నందున రైతుకు క్వింటాకు రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తగినన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతీ గింజను కొనుగోలు చేయాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం రూ. 2 లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ.15 వేల రైతు భరోసా అమలు చేయాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు బాల్దె సిద్ధిలింగం, ఇర్రి రమణారెడ్డి, గాడిపల్లి ప్రేమలతారెడ్డి, గద్దల నర్సింగరావు, పెద్ది రాజిరెడ్డి, పసుల ఏబెల్, బండ యాదగిరిరెడ్డి, స్వరూప, అనిత ఉన్నారు.

దేవరుప్పుల: పంటలు ఎండిపోయిన రైతులకు ప్రభుత్వ పక్షాన ఎకరాకు రూ.25వేలు పరిహారం ఇప్పించాలని కోరుతూ బీఆర్ఎస్ మండల నాయకులు మంగళవారం కలెక్టర్ రిజ్వాన్‌బాషాకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో గోదావరి జలాలతో చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు నింపడం వల్ల రెండు పంటలు పండేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గోదావరి జలాలు వదలక పోవటంతో భూగర్భజలాలు అడుగంటిపోయి బోర్లు వట్టి పోయాయని వివరించారు. యాసంగి పంట 50శాతం ఎండిపోయినందున రైతాంగానికి నష్టపరిహారం ఇప్పించాలని కోరారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న జనగామ బీఆర్ఎస్ నాయకులు

కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, తీగల దయాకర్, బస్వ మల్లేశం, చింత రవి, వంగ అర్జున్, గొడుగు మల్లికార్జున్, సోమనర్సయ్య, యాదగిరి, తిరుమలేశ్, బొందుగుల సోమయ్య, అబ్బసాయిలు పాల్గొన్నారు.

ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు అనుమతించాలి

- నెల్లుట్ల ఫ్లైఓవర్ వద్ద ఆర్టీసీకాలనీ వాసుల ఆందోళన



నెల్లుట్ల ఆర్టీసీ కాలనీ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న ప్లాటు యజమానులు

లింగాలఘణపురం, ఏప్రిల్2: లింగాలఘణపురం మండలం నెల్లుట్ల శివారు ఆర్టీసీ కాలనీలో మంజునాథ రియల్‌ఎస్టేట్ వ్యాపారుల వద్ద కొనుగోలు చేసిన ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు అధికారులు అనుమతులివ్వాలని యజమానులు ఆందోళనకు దిగారు. మంగళవారం నెల్లుట్ల ఫ్లైఓవర్ వద్దకు చేరుకున్న ప్లాట్ల యజమానులు కొద్దిసేపు జనగామ-సూర్యాపేట జాతీయరహదారి వద్ద ఆందోళనకు దిగారు. తాము కాయకష్టం చేసి కొనుగోలు చేసిన ప్లాట్లను తమ అవసరాల కోసం విక్రయించుకుందామంటే కొద్దిమంది ఉద్దేశపూర్వకంగా రిజిస్ట్రేషన్లను నిలిపేయాలని అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారని వాపోయారు. తామంతా నిబంధనల ప్రకారమే ప్లాట్లను కొనుగోలు చేశామన్నారు. నెల్లుట్ల చెరువు ఎఫ్‌టీఎల్ నిబంధనల పేరిట అందులో లేని భూములను సైతం అధికారులు రిజిస్ట్రేషన్లను నిలిపేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా అధికారులు ఎఫ్‌టీఎల్ హద్దులను ఏర్పాటు చేసి ఎఫ్‌టీఎల్ పరిధిలోకి రాని భూములకు రిజిస్ట్రేషన్లతో పాటుగా నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నెల్లుట్లకు చెందిన పట్టాదారుడు ఠాకూర్ లక్ష్మణ్ సింగ్ మాట్లాడుతూ కొద్దిమంది వ్యక్తులు డబ్బుల కోసం తన భూములపై తప్పుడు ఆరోపణలు చేస్తూ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. ఈ విషయమై 1983లోనే ఎలాంటి సీలింగ్ మిగులు భూములు లేవని ట్రిబ్యునల్ స్పష్టంగా తీర్పు ఇచ్చిందని, హైకోర్టు సైతం అదే తీర్పును సమర్థిస్తూ 2010లో ఉత్తర్వులను జారీ చేసిందని అన్నారు. హైకోర్టు జడ్జిమెంట్ ప్రకారం సదరు సర్వే నెంబర్లకు చెందిన క్లియరెన్స్ భూములకు అధికారులు వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరారు. తహసీల్దార్ వినయలత మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు నెల్లుట్ల చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను ఏర్పాటు చేసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపతామని అన్నారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, ఏప్రిల్ 2: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలతో పాటు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో తాత్కాలిక ప్రాతిపదికన పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్ పోస్టుల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చు. 2025 మార్చి 31 వరకు లేదా రెగ్యులర్ పోస్టులు భర్తీ అయ్యే వరకు తాత్కాలిక ప్రాతిపదికన గౌరవ వేతనంతో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ, పాథాలజీ, పల్మనాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, ఈఎన్‌టీ, అనస్థిషియాలజీ, రేడియో - డయాగ్నసిస్, ఆర్థోపెడిక్, మానసిక వైద్యుడు, కంటి వైద్యుడు పోస్టులతో మొత్తం నాలుగు కేటగిరీల్లో 36 ఖాళీలు ఉన్నాయి. అర్హత, ఆసక్తి గల వారు ఈ నెల 6న చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం రెండో అంతస్థులో గల ప్రిన్సిపాల్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరు కావాలి. ఆయా కేటగిరీలకు సంబంధించిన అప్లికేషన్ ఫారాలను ఆన్‌లైన్‌లో జీఎంసీ జనగామ డాట్ ఓఆర్‌జీ డాట్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

బ్రిడ్జి పనుల్లో నాణ్యత పాటించాలి

పీఆర్ డీఈ రాజగోపాల్‌రావు

చిలుపూర్, ఏప్రిల్ 2: హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పీఆర్ డీఈ రాజగోపాల్‌రావు సూచించారు. చిలుపూర్ గుట్టలో నిర్మిస్తున్న హైలెవల్ వంతెన పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలంలోని వెంకటేశ్వర్లపల్లి నుంచి చిలుపూర్ గుట్ట, చిలుపూర్ విలేజీ మీదుగా వెంకటాద్రిపేట వరకు మెయింటెనెన్స్ అండ్ రోడ్డు రెన్యువల్ (ఎంఆర్ఆర్) కింద రూ.3.19 కోట్ల నిధులు ఏడాది క్రితమే మంజూరు కాగా, అందులో బీటీ రోడ్డు రెన్యువల్ పనులను పూర్తి చేశారన్నారు. రూ.60 లక్షల వ్యయంతో ఆకేరు వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణ పనులు సాగుతున్నాయని అన్నారు. త్వరలోనే వాహనాల రాకపోకలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని నిర్వాహకులను ఆదేశించారు.

ఉపాధి పనులను పరిశీలించిన డీఆర్డీవో

బచ్చన్నపేట, ఏప్రిల్ 2: జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలకు రోజువారి వేతనం రూ. 300 చేశారని, దానికి అనుగునంగా పూర్తిస్థాయిలో పనిచేయాల్సి ఉంటుందని డీఆర్డీవో మొగులప్ప అన్నారు. మంగళవారం మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో ఈజీఎస్ పనులను, గ్రామ నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీల వేతనం పెరిగినందున కొలతల్లో రేటు పడేలా పనిచేయాల్సి ఉంటుందన్నారు. మస్టర్‌లను పరిశీలించారు. ఎండలు తీవ్రంగా ఉన్నాయని కూలీలు జాగ్రత్తలు పాటిస్తూ పనులు చేయాలన్నారు. వడదెబ్బ తగలకుండా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను అందించారు. అదేవిధంగా నర్సరీలలో పెంచుతున్న మొక్కలను జూన్‌లో వర్షాలు కురియగానే నాటాలన్నారు. టార్గెట్ ప్రకారం మొక్కలు దక్కేలా చూసుకోవాలన్నారు. డీఆర్డీవో వెంట ఎంపీడీవో రఘురామకృష్ణ, ఏపీవో కృష్ణ, టీఏ కర్నాకర్, సౌజన్య, చక్రధర్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



తమ్మడపల్లిలో కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీవో మొగులప్ప

ఘనంగా అష్టదళ పాదపద్మారాధన పూజ

8లో..



చిలుపూర్‌లో స్వామివారి పాదాలను 108 సువర్ణ పుష్పాలతో అలంకరించిన దృశ్యం

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

హనుమకొండ టౌన్, ఏప్రిల్2: ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలం కొత్తగట్టుకు చెందిన రామగిరి శ్రీనివాస్ (34) హనుమకొండ గోకుల్‌నగర్‌లో కిరాయి ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. హైదరాబాద్ వెళ్లేందుకు సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో బస్టాండ్‌కు వస్తున్న క్రమంలో జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అతివేగంతో వచ్చి ఢీకొట్టగా శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నా నిజాయితే రాజకీయ ఉన్నతికి మూలం

● బీఆర్‌ఎస్ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు.. ● మీడియా సమావేశంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 1: నిజాయితీ, క్రమ శిక్షణ, విలువలతో కూడిన జీవితమే తన రాజకీయ ఉన్నతికి మూలమని, మూడు దశాబ్దాలకుపైగా తన రాజకీయ జీవితంలో అవినీతి మచ్చలేకుండా ఉన్నానని అందువల్లే అన్ని వర్గాల వారు తనను విశ్వసిస్తున్నారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. మంగళవారం హనుమకొండలోని తన నివాసంలో వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కావ్యతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన కాంగ్రెస్‌లో తమ చేరికకు గల కారణాలు, బీజేపీ పాలన తీరు, బీఆర్‌ఎస్ నేతలు తనపై చేస్తున్న విమర్శలు, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగా ఆరోపణలు తదితర అంశాలపై వివరణ ఇచ్చారు. వివిధ వర్గాల్లో తనపై పెట్టుకున్న నమ్మకాన్ని కాపాడుకుంటూ రాజీపడకుండా ముందుకు వెళుతున్నానన్నారు. తన రాజకీయ ఉన్నతి కోసం ఎవరికీ అన్యాయం చేయలేదని, ఒకరి అవకాశాలను కొట్టి తన స్వార్థానికి ఉపయోగించుకునే చరిత్ర తనది కాదన్నారు. తానెప్పుడూ పదవుల కోసం వెంపర్లాడలేదని.. 1994లో తొలిసారిగా ఎమ్మెల్యే అయిన తరువాత కేబినెట్‌లో చోటు దక్కే వరకు ఆ విషయమే తనకు తెలియదని, ఇక ఎంపీగా గెలిచిన అనంతరం 2016లో కేసీఆర్ తనను పిలిచి డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారని గుర్తు చేశారు. 2024లో కాంగ్రెస్ పెద్దలు తనను పార్టీలోకి రావాలని కోరారని, బీఆర్‌ఎస్ నుంచి బయటకు వచ్చిన ఒక నాయకుడు కాంగ్రెస్‌లో చేరికకు రెండు నెలలుగా తిరుగుతున్నా పార్టీ చేర్చుకోవడం లేదని, కానీ అదే తనను పార్టీలోకి రావాలని కాంగ్రెస్ ఆహ్వానించిందన్నారు. దళితులు, ముస్లింలు, క్రైస్తవుల హక్కుల పరిరక్షణతోపాటు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ చేరానన్నారు. బీఆర్‌ఎస్ నుంచి ఎందరో పార్టీని వీడారని, వారందరినీ విడిచి తనొక్కడి విషయంలో మాత్రం కొందరు బీఆర్‌ఎస్ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, అది వారి అవివేకానికి నిదర్శనమన్నారు. తాను వారిలా సంస్కారం లేకుండా మాట్లాడలేనని, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోయి లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో కేసీఆర్ కుమార్తె పోటీచేస్తే మూడో స్థానమే అని ఆయన అనడమే నిదర్శనమన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న దయాకర్‌రావు తన మనవరాలి వయస్సున్న యశస్వినీరెడ్డి చేతిలో ఓడిపోయినా సిగ్గు రాలేదని, బలుపు, అహంకార మాటలు తగ్గలేదని వ్యాఖ్యానించారు. ఇక నిప్పు తొక్కిన కోతిలా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తనపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను భూకబ్జాలు, అక్రమాలకు పాల్పడినట్లు చెబుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. వాటిని నిరూపించాలని.. నిరూపిస్తే వాటిని ప్రభుత్వానికి అప్పగిస్తానని సవాల్ విసిరారు. లేదంటే జనగామ చౌరస్తాలో పల్లా రాజేశ్వర్‌రెడ్డిని బట్టలూడదీసి నిలబెట్టడం ఖాయమన్నారు. కొందరైతే తనను పండబెట్టి తొక్కుతామంటూ రెచ్చిపోతున్నారని, అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు పండబెట్టి తొక్కి న విషయాన్ని వారు గుర్తుంచుకోవాలన్నారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ దండోరా ముసుగు తీసి బీజేపీలో చేరాలని శ్రీహరి హితవు పలికారు. దళితులను హింసపెడుతూ, రిజర్వేషన్ల తొలగింపు కుట్రలు చేస్తున్న బీజేపీ పక్షాన ఆయన ఎలా చేరుతాడని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్స్ తీసుకువస్తే సరిపోతుందని, ఆ పని బీజేపీ పదేళ్లుగా ఎందుకు చేయడం లేదని మందకృష్ణ ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. తాను దళితజాతి పరిరక్షణకు కృషి చేస్తున్నానని, అంతేకానీ తన రాజకీయ స్వార్థం కోసం దళితవర్గాలనే కాదు.. ఏ వర్గాలకు అన్యాయం చేయలేదని పునరుద్ఘాటించారు. మందకృష్ణ విధానాల వల్లే ఎంఆర్‌పీఎస్ ముక్కలైందని ఆరోపించిన కడియం శ్రీహరి.. వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న తన బిడ్డ డాక్టర్ కావ్యను ఆశ్వీర్వదించి గెలిపించాలని ప్రజలను కోరారు. తన వలే నిజాయితీగా ప్రజలకు సేవ చేస్తుందని తాను హామీ ఇస్తున్నానన్నారు.

నమ్మకాన్ని నిలబెడతా : కావ్య

కాంగ్రెస్ అధిష్ఠానం తనపై నమ్మకంతో లోక్‌సభ టికెట్ కేటాయించడంపై డాక్టరు కడియం కావ్య అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలియచేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి, పార్టీ పటిష్ఠతకు నిజాయితీగా కృషి చేసి అటు పార్టీ.. ఇటు ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతానని తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ ఫీజుల గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 2: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం, బీబీఏ ఇతర డిగ్రీ రెండో, నాలుగో, ఆరో సెమిస్టర్ ఫీజులు చెల్లించుకునేందుకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఏప్రిల్ 4 వరకు పొడిగించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీ రామోజు నరసింహచారి, డాక్టర్ ఎం.తిరుమలదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే రూ.50 అపరాధ రుసుంతో ఏప్రిల్ 16 వరకు విద్యార్థులు ఫీజులు చెల్లించుకునే అవకాశం ఉందని తెలిపారు. రెగ్యులర్, బ్యాక్‌లాగ్, ఇంప్రూమెంట్ విద్యార్థులందరూ ఫీజులు చెల్లించుకోవాలని కోరారు. పరీక్షలు మేలో నిర్వహిస్తామని ప్రకటించారు.

రాజస్థాన్ కోట మోషన్ కాలేజ్‌లో ఉచిత బ్రిడ్జి కోర్సు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2: రాజస్థాన్ కోట్ మోషన్ ఐఐటీ, నీట్ కాలేజ్‌లో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఉచితంగా 35 రోజుల బ్రిడ్జి కోర్సును ఈనెల 5 నుంచి ప్రారంభిస్తున్నట్లు కళాశాల హనుమకొండ బ్రాంచి చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మంగళవారం ఒక ప్రటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణలో ఐఐటీ, మెడికల్ కోర్సులకు బేసిక్స్ కెరీర్ గైడెన్స్‌ను ఐఐటీ, నీట్ ఫ్యాకల్టీ బోధిస్తారని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట నయీంనగర్‌లోని బ్రాంచిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉచిత బ్రిడ్జి కోర్సును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నయీంనగర్ బ్రాంచిలో, 9703000850 ఫోన్‌నెంబర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు.

అనైతిక ప్రాక్టీస్‌పై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఉక్కుపాదం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 2: రాష్ట్ర చరిత్రలోనే మొదటి సారిగా 19మంది నకిలీ వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ కేసులు నమోదు చేసింది. ఈ కేసుల ప్రకారం రూ.5లక్షల నగదు జరిమానాతోపాటు యేడాది జైలు శిక్షను అనుభవించాల్సి ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కూడా ఆయుర్వేదం, హోమియో, యూనాని విద్యను అభ్యసించి అల్లోపతి చికిత్స అందిస్తున్న ముగ్గురిపై కూడా ఆయుష్ విభాగానికి ఫిర్యాదు చేసింది. వరంగల్ నుంచి డాక్టర్ జి.సురేష్, రంగంపేట నుంచి డాక్టర్ బి.సాంబయ్య, శంభునిపేట నుంచి డాక్టర్ టి.సదానందంలపై ఆయుష్ విభాగానికి ఫిర్యాదు చేసింది. నేషనల్ మెడికల్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర శాఖ చైర్మన్ డాక్టర్ మహేష్‌కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ హనుమంతరావు ఈ మేరకు ఫిర్యాదు చేశారు.

కాంట్రాక్టు వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 2: కాకతీయ మెడికల్ కాలేజీలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేసేందుకు ప్రొఫెసర్స్, అసోసియేట్ ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, సీనియర్ రెసిడెంట్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివ్వెల మోహన్‌దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 2: పద్మాక్షి పాలీక్లినిక్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ చౌరస్తాలోని తమ క్లినిక్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకుడు రఘు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. షుగర్, థైరాయిడ్, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు రక్తపరీక్షలతోపాటు టీఎస్‌హెచ్, టీ-3, టీ-4, జీఆర్‌బీఎస్, లిప్పిడ్ ప్రొఫైల్, ఈసీజీ పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. వైద్యరంగంలో సుదీర్ఘ అనుభం కలిగిన ప్రముఖ ఎండోక్రనాలజిస్ట్ డాక్టర్ ఇ.లక్ష్మణ్‌కుమార్, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ అనీల్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరం, రక్త పరీక్షలను నిర్వహిస్తామన్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్ వ్యాధిగ్రస్తులు గతంలో వాడుతున్న మందుల చిట్టీలను, రిపోర్టులను వెంట తీసుకొని రావాలని రఘు సూచించారు. ఉచిత వైద్యశిబిరంలో పాల్గొనే వారు సెల్ 9955996166, 9133893360 నెంబర్‌లలో ముందస్తుగా కాల్‌చేసి తమ నెంబర్‌ను రిజిస్టర్ చేసుకోవచ్చునని ఆయన వెల్లడించారు.

క్రూ కంట్రోల్ తరలింపును నిలిపివేయాలి

● లేదంటే ఆమరణ దీక్ష చేపడతా ● మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 3: కాజీపేట రైల్వే జంక్షన్ క్రూ కంట్రోల్ నుంచి క్రూ లింకుల తరలింపు చర్యలను వెంటనే నిలిపివేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. లేకుంటే ఆమరణ దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. తరలింపును బీజేపీ ఎందుకు అడ్డుకోవడం లేదని రాజేందర్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం హనుమకొండలోని ఓ కన్వెన్షన్ హాలులో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మా ట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్ లోపాయికార ఒప్పందాలవల్ల కాజీపేట రైల్వే జంక్షన్ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కాజీపేట ప్రాంతంలో నగరంలో ఒక ముఖ్య భాగంగా ఉన్నా అభివృద్ధిలో వెనకంజలో ఉందన్నారు. ఇందుకు బీఆర్‌ఎస్, బీజేపీలే కారణమని దుయ్య బట్టారు. కోచ్ ఫ్యాక్టరీ తరలిందని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన వ్యాగన్ పరిశ్రమ పనులు ఏమయ్యాయని ప్రశ్నిం చారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో జరగని అభివృద్ధిని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగునెలల్లో చూపించామని రాజేందర్ రెడ్డి చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలో పశ్చిమలో రూ.2కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి రూ.40లక్షల కోట్ల అభివృద్ధిగా చూపించారంటూ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌ను విమర్శించారు. పదేళ్లలో పశ్చిమ అభివృద్ధిని విస్మరించి ప్రజలను మాయ మాటలు చెప్పి నమ్మించారన్నారు. వరంగల్ పశ్చిమలో వరదలతో ముంపు సమస్య తలెత్తకుండా శాశ్వత చర్యలు చేపడుతున్నట్లు రాజేందర్‌రెడ్డి చెప్పారు. ఇందులో భాగం గా నయీంనగర్ బ్రిడ్జి, విస్తరణ చేపట్టినట్లు చెప్పారు. ఈనెల 5వతేదీన నయీంనగర్ బ్రిడ్జిని కూలగొట్టి కొత్తగా విస్తరణ పనులు చేపట్టనున్నట్ల వెల్లడించారు. రెండు నెలల్లో బ్రిడ్జి పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు చెప్పారు. పెద్దపెండ్యాల జంక్షన్ వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. బ్రిడ్జి నిర్మాణం వల్ల వాహనాలు వంతెన పై నుంచి రాకపోకలు సాగించవచ్చన్నారు. రెండు నెలల్లో హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి అవుతుందన్నారు. ఇక భద్రకాళి మాడ వీధుల నిర్మాణం చర్యలు కూడా అమల్లో ఉన్నాయన్నారు. బీఆర్‌ఎస్ నేతల పాపాలే వారిని వెంటాడుతున్నాయని రాజేందర్‌రెడ్డి దుయ్యబట్టారు.



సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

లిక్కర్ కేసు, ఫోన్ ట్యాపింగ్, భూకబ్జాలు ఇలా అనేక అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. కేసీఆర్ కుటుంబ అక్రమాలు మరిన్ని వెలుగులోకి వస్తాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో దోపిడీ చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగునెలలు కాకముందే కేసీఆర్ కరువుయాత్ర పేరుతో విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. వర్షాకాలమే రాలేదు కరువు ఎక్కడిదని ప్రశ్నించారు. పశ్చిమలో ధరణి పేరిట భూ దందాలు, కబ్జాలు, అనేక అక్రమాలను ప్రజలే బయటపెడుతున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరుపనున్నట్లు రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. ధరణి పేరిట భూముల స్వాహాతో పాటు బాలసముద్రంలో అక్రమంగా నిర్మించిన బీఆర్‌ఎస్ కార్యాలయంపై విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, పీసీసీ నాయకులు బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్, గుంటి కుమారస్వామితో పాటు బీసీ సెల్ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్ యాదవ్, పోతుల శ్రీమాన్, మామిండ్ల రాజు, మానస రాంప్రసాద్, సయ్యద్ విజయశ్రీ రజాలీతో పాటు చీకటి ఆనంద్, నాయిని లక్ష్మారెడ్డి, డాక్టరు శ్రవణ్, బంక సంపత్ యాదవ్, కార్తీక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖలో పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలి

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 2: హనుమకొండలోని ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖలో ఏళ్ల తరబడి ఇక్కడే విధులు నిర్వహిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారులను బదిలీచేసి వారిపై చర్యలు తీసుకోవాలని లంబాడ హక్కుల పోరాట సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు అజ్మీరా వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట్ మాట్లాడారు. ఇంజనీరింగ్ శాఖ లో కొన్నేళ్లుగా కొందరు అధికారులు విధులు నిర్వహించడంలో ఆంతర్యమేమిటన్నారు. ఇక్కడే పాతుకుపోయిన అధికారులను వెంటనే బదిలీ చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు రమేష్ నాయక్, బాదావత్ భాస్కర్ నాయక్, నూనావత్ శ్రీనివాస్ నాయక్, జాటోతు బావుసింగ్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

బెల్టు షాపులపై దాడి

వరంగల్ క్రైం, ఏప్రిల్ 2: టాస్క్‌ఫోర్స్ పోలీసులు వరంగల్ నగరంలోని పలుచోట్ల బెల్టుషాపులపై దాడులు చేశారు. మంగళవారం నిర్వహించిన దాడిలో రూ.22వేల విలువ కలిగిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దేశాయిపేటలో రూ.8490, వడ్డెపల్లి రెండు ఇళ్లల్లో ఒకరి ఇంట్లో రూ.7300, మరొకరిఇంట్లో రూ.6420 విలువ కలిగిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూధన్ ధ్రువీకరించారు.

'రూ.2వేల నోట్లు మార్చుకోవచ్చు'

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 2: ప్రభుత్వం రూ.2వేల నోట్లను రద్దు చేసి, గత సంవత్సరం అక్టోబరు వరకు మార్చుకునే అవకాశాన్ని కల్పించిందని, ఇంకా ఎవరివద్దనైనా రూ.2నోట్లు ఉంటే రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయం హైదరాబాద్‌లో మార్చుకోవచ్చని జిల్లా లీడ్ బ్యాంకు అధికారి రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.20వేల వరకు మార్చుకొనే అవకాశం ఉందని, రీజినల్ కార్యాలయంలో నోట్లు మార్చుకునే వారు తమ బ్యాంకు అకౌంట్ వివరాలతో నోట్లను రీజినల్ కార్యాలయంలో అందించిన తర్వాత వారి ఖాతాలో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. పోస్టాఫీసుల్లో కూడా తమ బ్యాంకు అకౌంట్ పూర్తి వివరాలు, పోస్టాఫీసులో పూర్తి వివరాలతో నోట్లను అందజేస్తే మార్పిడి అనంతరం వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. రూ. 20వేలకు మించి ఉంటే కేవైసీ సర్టిఫికెట్‌తో ఇతర వివరాలను రీజినల్ బ్యాంకు కార్యాలయంలో అందించాలని తెలిపారు. దేశ వ్యాప్తంగా రిజర్వు బ్యాంకుకు చెందిన 18 సెంటర్లు ఉన్నాయని ఏ సెంటర్‌లోనైనా మార్చుకునే అవకాశాన్ని ఆర్‌బీఐ కల్పించిందని అన్నారు.

కమిషనరేట్‌లో సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్

ప్రారంభించిన సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, ఏప్రిల్ 2: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రారంభించారు. నేరాల నియంత్రణలో భాగంగా రాష్ట్ర సైబర్ క్రైం సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఆరు సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వరంగల్‌లో ఒక స్టేషన్ ప్రారంభించారు. స్టేషన్‌ను ప్రారంభించిన అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దన్నారు. సెల్‌ఫోన్లకు వచ్చే లింక్‌లను క్లిక్ చేయవద్దన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు నూతనంగా ఏర్పాటు చేసిన సైబర్‌క్రైం స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని కమిషనర్ సూచించారు. సైబర్ నేరానికి గురైన బాధితులు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో సైబర్ వారియర్స్‌గా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి కమిషనర్ చేతుల మీదుగా సెల్‌ఫోన్‌లు, సిమ్ కార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు రవిందర్, అబ్దుల్ బారీ, ట్రెయినీ ఐపీఎస్‌లు అంకిత్, శుభంనాగ్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్, సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ ఏసీపీ విజయ్‌కుమార్, సీఐ రవి తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్‌ను ప్రారంభిస్తున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా

ఆటిజమ్‌పై అవగాహన పెంచుకోవాలి

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 2: ఆటిజమ్ ఏ విధంగా వచ్చిందో అనేది కాకుండా.. ఎలా జయించాలో తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని వరంగల్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ సూచించారు. అంతర్జాతీయ ఆటిజమ్ అవగాహన దినోత్సవాన్ని మంగళవారం వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌లోని డైక్ కేంద్రంలో వరంగల్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పీడియాట్రిక్స్, ఎంజీఎం ఆధ్వర్యంలో ఆటిజమ్ పిల్లలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ.. పీడియాట్రిక్ విభాగంలో అనేక వసతులు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకొని పిల్లల ఎదుగుదల పట్ల శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ గోపాల్‌రావు, డాక్టర్ వాసుదేవ్, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ శేషుమాధవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

బిల్లులు చెల్లించకుంటే ఆత్మహత్యలే..

బల్దియా కాంట్రాక్టర్ల నిరసన

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 2: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో రెండేళ్లుగా చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని, ఇదే విధంగా బిల్లుల విషయంలో జాప్యం చేస్తే ఆత్మహత్యలు తప్పవని బల్దియా కాంట్రాక్టర్లు అధికారులను హెచ్చరించారు. జీడబ్ల్యు ఎంసీ కాంటార్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజారావు, ఎమ్డీ అదిల్ అమ్మద్ సంయుక్తంగా మాట్లాడారు. బల్దియాలో ప్రస్తుతం పైరవీకార్లకు, పర్సంటేజ్‌కార్లకే చేసిన పనులకు బిల్లులు చెల్లిస్తున్నారని, తమ లాంటి వాళ్లకు బిల్లులు చెల్లించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని అన్నారు. జనరల్ ఫండ్స్ బిల్స్ ఇప్పటివరకే తమకు రూ.20కోట్ల వరకు రావాలని 2024లో వివిధ రకాల పన్నులు వసూలు చేసిన రూ.76 కోట్లు ఏం చేశారని వారు ప్రశ్నించారు. సీఎంఏ బిల్లులు కూడా చాలారోజులుగా పెండింగ్‌లో ఉన్నాయని ఇదేవిధంగా జరిగితే తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉంటుందన్నారు. చాలామంది కాంట్రాక్టర్లు అప్పులు చేసి బల్దియా అభివృద్ధి పనులు చేశామని, రోస్టర్ విధానం కాకుండా బడా కాంట్రాక్టర్లకు కొందరు అధికారులు అడ్డదారిలో బిల్లులు చెల్లిస్తున్నారని ఆరోపించారు. తమకే వచ్చే బిల్లులు తక్షణమే చెల్లించాలని వారు డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణంరాజు, తిరుపతి, దేవేందర్, రాజేంద్రప్రసాద్, బొక్క కుమారస్వామి, రవి, నాగరాజు, అప్పాల శ్రీనివాస్‌లతో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు.



నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టర్లు

తుక్కుగూడ సభకు తరలాలి..

● ఉమ్మడి జిల్లా నుంచి తరలింపు ఏర్పాట్లు చేస్తున్నాం ● మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖ

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 2: ఈ నెల 6న హైదరాబాద్ తుక్కుగూడలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పాల్గొనే కాంగ్రెస్ సభకు భారీగా తరలి.. విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం హనుమకొండలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తుక్కుగూడ సభ విజయవంతానికి తగిన ప్రణాళికలు రూపొందించామని, ఉమ్మడి జిల్లాలోని ప్రతీ గ్రామం నుంచి శ్రేణుల తరలింపునకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ముఖ్య నేతల తరలింపు ఏర్పాట్లను సమీక్షించి ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సభలో అగ్రనేత రాహుల్‌గాంధీ పాల్గొని లోక్‌సభ ఎన్నికల కాంగ్రెస్ మేనిఫెస్టోను విడుదల చేస్తారని వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఆరు గ్యారంటీలను ప్రకటించారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గ్యారంటీలను అమలు చేసి ప్రజాదరణ పొందుతున్నట్లు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టో కూడా ప్రజా సంక్షేమం, అభివృద్ధికి దిక్సూచిగా ఉండనుందన్నారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో బలమైన విశ్వాసం నెలకొంటుండగా బీఆర్‌ఎస్ నేతలు జీర్ణించుకోలేక అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని మంత్రి సురేఖ ధ్వజమెత్తారు. వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన డాక్టర్ కావ్యకు పార్టీ శ్రేణులు అండగా నిలిచి భారీ మెజారిటీతో ఆమెను గెలిపించాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరడం ఆనందంగా ఉందన్నారు.

కాంగ్రెస్ పటిష్ఠానికి కృషి చేస్తా : కడియం

కాంగ్రెస్‌లో చేరాక తొలిసారిగా డీసీసీ భవన్‌కు వచ్చిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. పార్టీ పటిష్ఠానికి అంకితభావంతో కృషి చేస్తానన్నారు. పార్టీ ఇచ్చిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి.. కడియం శ్రీహరిని సన్మానించారు. మీడియా సమావేశంలో వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, గండ్ర సత్యనారాయణతో పాటు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో శ్రీహరిని సత్కరిస్తున్న నాయిని, చిత్రంలో మంత్రి కొండా సురేఖ, తదితర నాయకులు

తుక్కుగూడ, లోకసభ ఎన్నికపై సమీక్ష

మీడియా సమావేశం అనంతరం మంత్రి కొండా సురేఖ, వరంగల్ లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితర నేతలు డీసీసీ భవన్‌లో సమీక్ష జరిపారు. తుక్కుగూడ సభకు వాహనాల సమకూర్పు, నియోజకవర్గాల వారీగా శ్రేణుల తరలింపు, నాయకులు బాధ్యతల విభజన తదితర అంశాలతో పాటు వరంగల్ లోక్‌సభ ఎన్నిక అంశాలను చర్చించినట్టు తెలిసింది.

ఎన్నికల శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



ఎన్నికల శిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

జనగామ కల్చరల్, ఏప్రిల్ 2: జిల్లా కేంద్రంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్నికల శిక్షణ కేంద్రాన్ని మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణకు పీవోలు, ఏపీవోలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. మాక్ పోలింగ్ పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఫార్మ్-12లో సవరణలపై తగు సూచనలు చేశారు. హెల్ప్ డెస్క్ పని విధానాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

క్షేత్ర స్థాయిలో యాక్షన్ ప్లాన్ రూపొందించాలి..

వేసవి దృష్ట్యా ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎంఎన్‌వోలు క్షేత్ర స్థాయిలో యాక్షన్ ప్లాన్ రూపొందించాలని, ప్రతీ గ్రామ పంచాయతీ స్థాయిలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా కోరారు. కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎంఎన్‌వోలు, ఎంఎంబీ ఇంజనీర్లు, ఏఈలు, మండల సమాఖ్య అధ్యక్షులతో సమీక్ష నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా రెండు నెలల్లోగా పాఠశాలల్లో మరమ్మతు చేయాలన్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. జిల్లాలో పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో అనిల్ కుమార్, డీపీవో వినోద్ కుమార్, డీఆర్‌డీపీ మొగులప్ప, డీఎస్‌ఓ రోజారాణి, డీఎం సీఎస్.ప్రసాద్, డీఈవో కె.రాము, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

రఘునాథపల్లి వైద్యాధికారులకు కలెక్టర్ ఆదేశాలు

రఘునాథపల్లి, ఏప్రిల్ 2: స్థానిక పీహెచ్‌సీని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా మంగళవారం తనిఖీ చేశారు. ప్రజలతో వైద్య సిబ్బందితో పాటు ల్యాబ్ టెక్నీషియన్ వ్యవహరిస్తున్న తీరును, ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. ప్రజల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. పిహెచ్‌సీలో వైద్య సిబ్బంది కొరత ఉందని వైద్యాధికారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌వో హరీష్ రాజ్, ప్రోగ్రాం ఆఫీసర్ మహేందర్, టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ అశోక్ కుమార్, మండల వైద్యాధికారి కమలహాసన్, ఆయుష్ వైద్యాధికారి రజియా సుల్తానా, సిబ్బంది బిక్కు నాయక్, విష్ణు వర్దన్ రెడ్డి, పాండరి తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 2: జిల్లా కేంద్రంలోని పలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ చేపూరి కృష్ణమూర్తి మంగళవారం తనిఖీ చేశారు. లైసెన్స్‌లు లేకుండా నిర్వహిస్తున్న యజమానులకు నోటీసులు అందించారు. సుమారు 12 హోటళ్లను తనిఖీ చేసి ఒక్కొక్కరికి రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు జరిమానా విధించారు. హోటల్ సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.

'వేసవిలో ముందు జాగ్రత్తలు పాటించాలి'

కొడకండ్ల, ఏప్రిల్ 2 : వడదెబ్బ నుంచి తప్పించుకోవాలంటే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి హరికృష్ణ సూచించారు.స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆయన మాట్లాడుతూ అత్యవసరమైతే తప్ప ఎండలో తిరగ వద్దని సూచించారు. మత్తు పానీయాలు, శీతల పానీయాలు సేవించవద్దని, తరుచూ మంచి నీళ్ళు, కొబ్బరి నీళ్ళు, ఓఆర్‌ఎస్ తాగాలని సూచించారు. ఒకవేళ వడదెబ్బ తగిలితే చాతిపై బట్టలు తొలిగించి చల్లని నీరు తాగించాలని, చల్లని వస్త్రంతో శరీరం తుడవాలని, చాతి, మెడపై ఐస్ ప్యాక్స్ ఉంచితే ఉపశమనం కలుగుతుందని అన్నారు.

పాపన్న జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి ఐలోని సుధాకర్‌గౌడ్

పాపన్న వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించిన నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 2: పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న జీవితాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి ఐలోని సుధాకర్‌గౌడ్ పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న 314వ వర్ధంతి సందర్భంగా తాటికొండ గ్రామంలో పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల ప్రజలు సర్వాయి పాపన్నను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు బొంగోని యాదగిరి, నాయకులు సానాది రాజు, అక్కినపల్లి సత్యం, పందుగ భద్రయ్య, బేతి రత్నాకర్ రెడ్డి, ఘనపురం వీరస్వామి, వెంకటయ్య, తాటికొండ సంపత్, కోరుకొప్పుల మధు, బిక్షపతి, ఐలోని రాజు, పోకల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గడ్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కూనూరులో గౌడ సంఘం ప్రతినిధులు, గీత కార్మికులు నివాళులు అర్పించారు. స్థానిక సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ పాపన్న గౌడ్ నాటి నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా మొగలులు, జాగీర్దారులను ఎదిరించి బహుజన రాజ్యాన్ని స్థాపించాడని కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ, గీత కార్మిక సంఘాల ప్రతినిధులు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్, గడ్డం రాజు, మూల మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ ఇల్లందుల కుమార్, యుగంధర్, కోట రాజు, చిర్ర ఎల్లయ్య, మోడెం అశోక్, సమ్మయ్య, ఎల్లయ్య, రాజయ్య, నర్సయ్య, నాగరాజు, ప్రసాద సాయి, శ్రీనివాస్, కుమార్, మోడెం రాజు, సాయికుమార్, గణేష్ పాల్గొన్నారు.

కొడకండ్ల: సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా రామవరం, ఏడునూతుల గ్రామాలతో పాటు మండలకేంద్రంలోని పాపన్న విగ్రహాల వద్ద గౌడ నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజనులను ఐక్యం చేసి 12 వేల మంది సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని వందల సంవత్సరాల క్రితమే పాపన్న చక్కని పాలన అందించాడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య, పేరం రాము, కె.అమరేందర్‌రెడ్డి, ఎండీ ఆసిఫ్, ఎం.వెంకటనరాయణ, రవీందర్, షన్ను, నర్మెట శ్రీనివాస్, శశి, దూలం సతీష్, బాల్నె వెంకన్న, దేశగాని సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: సర్దార్ సర్వాయి పాపన్నకు పురుడు పోసిన ఖిలాషాపూర్‌లో ఆయన విగ్రహానికి బీజేపీ నాయకులు మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. మూడున్నర శతాబ్దాల క్రితమే బహుజనుల రాజ్యాధికారం కోసం మొఘల్ సామ్రాజ్యవాదులను గడగడలాడించిన యోధుడు సర్వాయి పాపన్న అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్, నాయకులు రంజిత్, మంద వెంకటేషం, రంగు రాజశేఖర్, రాజ్‌కుమార్, ఉపేందర్ పాల్గొన్నారు.

పాలకుర్తి: బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న 314వ వర్ధంతిని పురస్కరించుకొని సర్వాయి పాపన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం రాజీవ్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ మూల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల ప్రజలు సర్వాయి పాపన్నను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో చిట్యాల రాంచంద్రం, పొడిశెట్టి వెంకన్న, తాళ్ల సోమనారాయణ, సమ్మయ్య, పులి గణేష్, మెరుగు ఉప్పలయ్య, పూజారి కుమారస్వామి, కమ్మగాని మహేష్ పాల్గొన్నారు.

లింగాలఘణపురం: సర్దార్ సర్వాయి పాపన్న 314 వర్ధంతి సందర్భంగా నవాబుపేటలో గౌడ ఐక్యసాధన సమితి ఆధ్వర్యంలో నివాళి నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో గౌడ ఐక్యసాధన సమితి జిల్లా అధ్యక్షుడు బూడిది నర్సయ్య, నాగపురి రాము, బూడిది బాలు, వెంకన్న, వెంకటేశ్వర్లు, రవి, వంశీ ఉప్పలయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పాలకుర్తిలో పాపన్న విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న గౌడ నాయకులు



కూనూరులో పాపన్న వర్ధంతి నిర్వహించిన గౌడ సంఘం ప్రతినిధులు



కొడకండ్లలో నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు



నవాబుపేటలో నివాళులు అర్పిస్తున్న గౌడ ఐక్యవేదిక సభ్యులు



తాటికొండలో నివాళి అర్పిస్తున్న సుధాకర్‌గౌడ్ తదితరులు



ఖిలాషాపూర్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కావ్య గెలుపునకు కృషి చేయాలి

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బ్రహ్మారెడ్డి ● కడియం శ్రీహరికి జైకొట్టిన బీఆర్ఎస్ నాయకులు



జఫర్‌గడ్‌లో కడియం, కావ్యలకు జై కొడుతున్న బీఆర్ఎస్ నాయకులు

జఫర్‌గడ్, ఏప్రిల్ 2: వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ కడియం కావ్య గెలుపు కోసం కలిసికట్టుగా కృషి చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి కోరారు. మంగళవారం తమ్మడపల్లి(జి), జఫర్‌గడ్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసమే ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరారన్నారు. ఆయనకు పార్టీ శ్రేణులు అండగా నిలవాలన్నారు. కాంగ్రెస్‌లో చేరిన కావ్యకు వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆమె విజయం కోసం ఇంటింటి ప్రచారంతో ముందుకు సాగాలన్నారు. ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. కాగా, జఫర్‌గడ్ మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెంటే సాగుతామని సమావేశంలో ప్రకటించారు. డాక్టర్ కావ్య గెలుపు కోసం పాటుపడతామన్నారు. ఈ సమావేశాల్లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుజ్జరి రాజు, బీఆర్ఎస్ నేతలు కుల్ల మోహన్‌రావు, అన్నెపు అశోక్, జ్యోతి యాకయ్య, ఇల్లందుల మొగిలి, మాజీ సర్పంచ్‌లు ఎం.నర్సింగం, బవరుణ్, కుల్ల రాజు, గుడ్డేటి స్వామి, ముజీబ్, హబీబ్‌ఖాన్, సారంగం, గద్ద కొమురయ్య, మారెపల్లి ప్రభాకర్, షరీఫ్, సాయిలు,. తదితర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను మంగళవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, మాజీ ఎంపీపీ కట్టా మనోజ్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల అయిలయ్య, తదితరులు హన్మకొండలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్‌కు మంచి రోజులు: దూదిపాల

స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీలోకి ఎమ్మెల్యే కడియం శ్రీహరి రావడంతో పార్టీకి మంచి రోజులు వచ్చాయని పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కడియంతో ఘన్‌పూర్ అన్ని విధాల అభివృద్ధి చెందడం ఖాయమన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య భారీ మెజార్టీతో గెలువబోతుందన్నారు.

బీఆర్ఎస్ భూస్థాపితం అవుతుంది: కొలిపాక

స్టేషన్‌ఘన్‌పూర్: సీఎం రేవంత్ రెడ్డి చేతిలో బీఆర్ఎస్ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జి కొలిపాక సతీష్ హెచ్చరించారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు కడియం శ్రీహరిపై మతి భ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అడ్రస్ లేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో చల్లా తిరుపతి, శ్రీనివాస్, జె.శ్రీనివాస్, వెంకటస్వామి, నరేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కడియంను కలిసిన నాయకులు

ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు కడియం కావ్య కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పాటు కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా కడియం కావ్య ఎంపిక కావడం పట్ల పార్టీ నాయకులు మంగళవారం హన్మకొండలోని కడియం నివాసం వద్ద వారిని కలిసి సత్కరించారు. కార్యక్రమంలో మార్క శ్రీనివాస్‌గౌడ్, పోగుల సారంగపాణి, చేపూరి వినోద్, మాదిరెడ్డి రాఘవరెడ్డి, లూనావత్ సుమన్‌నాయక్, చల్లా తిరుపతి, ఏలియా, మారపాక వసంత్, రాజు, పొన్న రాజేష్, రొయ్యల దూమయ్య, మారపాక శ్రీనివాస్, వెంకటస్వామి పాల్గొన్నారు.

బాప్‌రే.. దంచి కొడుతున్న ఎండలు

(5వ పేజీ తరువాయి)

నిర్మాణ, ఉపాధి హా మీ కూలీల వంటి వారు జాగ్రత్తగా ఉండాలని చెబు తున్నారు. ఎండలో పనిచేయడం, తిరగడం వల్ల శరీరం లోని నీటి శాతం తగ్గి డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్ర మాదం ఉందని, ఈ క్రమంలో క్రమం తప్ప కుండా నీటిని తాగుతూ ఉండాలని, వీటితో పాటు పండ్ల రసాలు, ఓఆర్‌ఎస్ ద్రావణం వంటివి తీసుకుంటే వడదెబ్బ తాక కుండా ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి: కలెక్టర్

వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జిల్లాలోని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండా లని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. కలెక్ట రేట్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో వైద్యా. దికారులకు పలు సూచనలు చేశారు. మండల కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేసి వారికి వేసవి తీవ్రత, వడదెబ్బ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాల న్నారు. పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లు, గ్రామ పంచాయతీ, తహసీల్దార్ కార్యాలయాలు, బస్టాండులు, రైల్వే స్టేష న్లు, పోలీస్ స్టేషన్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఉపాధి హామీ పని జరిగే చోట సరిపడా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, మందులు అందుబాటులో ఉంచాల న్నారు. వడదెబ్బ కేసులకు సత్వరమే మెరుగైన వైద్యం అందించా లని ఆదేశించారు. ఈ సం దర్భంగా 'వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు' ఈ అంశంపై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

బీజేపీ అనుబంధ కమిటీల ఏర్పాటు

బచ్చన్నపేట, ఏప్రిల్ 2: మండల కేంద్రంలో మంగళవారం పార్టీ ప్రధాన కార్యదర్శులతో పాటు అనుబంధ కమిటీల మండల అధ్యక్షులను నియమించారు. పార్టీ మండల ప్రధానకార్యదర్శులుగా మినలాపురం జలంధర్ (కొడవటూరు), కందుకూరి నవీన్ (కొన్నె), ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులుగా గంగిశెట్టి శ్రీనివాస్ (కట్కూరు), బీజేవైఎం బంగారు మహేశ్ (నాగిరెడ్డిపల్లి), కిసాన్‌మోర్చా నీల కనకయ్య (కొడవటూరు), ఎస్సీ మోర్చా జంధ్యాల సురేశ్ (పోచన్నపేట)ను ఎన్నుకున్నారు.

తాగునీటి సమస్య రావొద్దు: ఎంపీవో

చిలుపూర్, ఏప్రిల్ 2: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీవో శ్రీపాద మధుసూదన్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం రాజవరం తండా, తీగలతండా, చిలుపూర్ గుట్ట, చిన్నపెండ్యాల తదితర గ్రామాలను సందర్శించిన ఆయన మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను పరిశీలించారు. తాగునీటి సరఫరా ఏ విధంగా జరుగుతుందన్న విషయాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ, కొద్ది రోజులుగా ఎండలు మండిపోతున్నందున తాగునీటి వినియోగం పెరిగిపోతోందని, మిషన్ భగీరథ నీటితో పాటు, ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా బోరుబావులను అందుబాటులోకి తెచ్చుకోవాలని కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట కార్యదర్శులు మల్లం హైమావతి, ఎమ్డీ అజీజ్ పాషా, శశిధర్ రెడ్డి, కారోబార్లు గూడూరు భాస్కర్, ఇల్లందుల సారయ్య తదితరులు ఉన్నారు.

బెల్ట్ షాపుల్లో మద్యం నిల్వలు ఉంటే

సీజ్ చేయాలి: ఆర్డీవో

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 2: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లో బెల్టు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి మద్యం నిల్వలు ఉంటే సీజ్ చేయాలని ఆర్డీవో ధరంసోత్ వెంకన్న తెలిపారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఎక్సైజ్ సిబ్బందితో ఎన్నికల వేళ అనుసరించాల్సిన విదివిధానాల పై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో జరిగేలా ఎక్సైజ్ సిబ్బంది కృషి చేయాలన్నారు. మద్యం సరఫరాపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల వారీగా తనిఖీలు నిర్వహించి అక్రమ మద్యం సరఫరా, నిల్వలు గుర్తించి సీజ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ భీమ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో, ఏసీపీ

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

● ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ విక్రమ్‌కుమార్

చిలుపూర్, ఏప్రిల్ 2: మండలంలక్ష ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ విక్రమ్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన నష్కల్, మల్కాపూర్, కొండాపూర్, వెంకటాద్రిపేట గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు మేలు చేకూర్చాలన్న ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం ఊరూరా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం ఈద రమేష్‌కుమార్, సీసీలు రమాదేవి, గట్టు శ్రీనివాస్, శోభ, పంచాయతీ సెక్రటరీలు ఎన్నకూస రాజు, కొత్త శ్రీకాంత్, స్నేహ, మంతెన రాజు, షమ్మాదేవి, మాదంశెట్టి కనకతార, ఎలిశాల రజిత, తోకల కరుణ, పోలేపల్లి సంధ్య, రాంరెడ్డి, రజిత పాల్గొన్నారు.



మల్కాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విక్రమ్‌కుమార్

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం..

రఘునాథపల్లి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో గార్లపాటి శ్రీనివాసులు సూచించారు. శివాజీనగర్‌లో ఐకేపీ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఏ-గ్రేడ్ ధాన్యానికి రూ.2203, కామన్ గ్రేడ్‌కు రూ.1883 ధర ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం కే.సారయ్య, సీసీలు సంపత్, రేనావతి, వివోఏ రాజేశ్వరి, మెంబర్లు శోభ, కావ్య, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పోర్ట్‌ఫోలియో జడ్జిని కలిసిన లాయర్లు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 2: జనగామ కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదులు పోర్ట్‌ఫోలియో జడ్జిని కలుసుకున్నారు. మంగళవారం హైద్రాబాద్ హైకోర్టులో జనగామ పోర్టు పోలియో జడ్జి భీమపాక నాగేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలగందుల చంద్రరుషి కార్యవర్గాన్ని ఆయన అభినందించారు. స్థానిక కోర్టు, బార్ పరిధిలోని సమస్యలను వివరించారు. జనగామ కోర్టును సందర్శించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు శ్రీరామ్ శ్రీనివాస్, పానుగంటి శ్రీనివాస్, కూరెళ్ల శ్రీనివాస్‌రెడ్డి, స్టీవెన్, కోట శంకర్, నరిగె బాలకిషన్, నక్క సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ తీరు సరికాదు: సీపీఎం

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 2: తనను కలువడానికి వచ్చిన సీపీఎం నాయకుల పట్ల కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా దురుసుగా మాట్లాడడం సరికాదని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమావేశం అనుమతి కోసం ఆన్‌లైన్ సెంటర్‌లో యాప్ ఓపెన్ కావడం లేదని, ఈ సమస్యను కలెక్టర్‌కు వివరిచడానికి వెళ్లిన నాయకుల పట్ల దురుసుగా మాట్లాడారని తెలిపారు. "కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదు చేయాలని తెలువదా, మీ పార్టీ నుంచి సమావేశానికి వచ్చేటోడు ఎవడు వాడు వాడికి తెలువదా" అని కలెక్టర్ దురుసుగా మాట్లాడాడని తెలిపారు. ఎన్నికల వేళ సమస్యలు చెప్పేందుకు వెళ్లిన నాయకుల పట్ల దురుసుగా మాట్లాడిన కలెక్టర్‌ను ఎన్నికల విధుల నుంచి తప్పించి జిల్లాలో ఎన్నికలు సజావుగా జరిగేలా ఎన్నికల సంఘం చూడాలని కోరారు. కార్యక్రమంలో కొడెపాక యాకయ్య, వంగపండ్ల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక



సందీప్, ధర్మభిక్షం

జనగామ కల్చరల్, ఏప్రిల్ 2: ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా దడిగె సందీప్, బానోతు ధర్మభిక్షం రెండోసారి ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఏకశిల డిగ్రీ కళాశాలలో జరిగిన ఎస్ఎఫ్ఐ 3వ మహాసభలో 19 మందితో జిల్లా కమిటీని నియమించారు. అనంతరం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల, ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

ఘనంగా పాదపద్మారాధన పూజ

చిలుపూర్, ఏప్రిల్ 2: మండల కేంద్రంలోని బుగులు వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం అష్టదళ పాదపద్మారాధన పూజను ఘనంగా నిర్వహించారు. సువర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజను పురస్కరించుకుని ఆలయ ఆవరణలో చేపట్టిన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, పూజారి సౌమిత్రి రంగాచార్యుల వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజలు చేపట్టి భక్తులకు స్వామివారి శేష వస్త్రాలతో పాటు, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో లక్ష్మీప్రసన్న, ఉత్సవ కమిటీ చైర్మన్ మామిడాల యాదవరెడ్డి, ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్ రావు, కృష్ణమాచార్యులు, మాజీ ధర్మకర్త సంగోజు మోహనాచారి - శంకరలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ ఆడెపు రమేష్, రికార్డ్ అసిస్టెంట్ వీరన్న, విశాల్, గాదె రాజశేఖర్, మహేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ

జఫర్‌గడ్, ఏప్రిల్ 2: మండలంలోని ఉప్పుగల్లు జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు జఫర్‌గడ్ వైస్ ఎంపీపీ కొడారి కనకయ్యలక్ష్మీ దంపతులు తమ కుమారుడు లోకేశ్ స్మారకార్థం మంగళవారం డిక్షనరీలను పంపిణీ చేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం పి.కిషన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మొదట లోకేశ్ చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం రూ.14 వేల విలువ గల డిక్షనరీలను 120 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ డిక్షనరీల ద్వారా విద్యార్థులు భాష, సమాచార నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు.